క్లుప్తంగా

15లోపు ఈకేవైసీ

పెద్దపంజాణి: పీఎం కిసాన్ ఈకేవైసీ చేసుకోని రైతులు ఈ నెల 15వ తేదీలోగా రైతు భరోసా కేంద్రం, కస్టమర్ సర్వీస్ సెంటర్లను సంప్రదించి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రభీబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేసుకోని రైతులకు 13 విడత పీఎం కిసాన్ నగదు జమకాదని పేర్కొన్నారు. రబీ ఈ పంట నమోదు కార్యక్రమం మొదలైందని, రైతులు సాగు చేసిన పంటలను ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి ఈ పంటలో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఈకేవైసీ ఉంటేనే పీఎం కిసాన్

పుంగనూరు: స్థానిక వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని రైతులందరు ఈనెల 15లోపు ఈకేవైసీ చేసుకోవాలని ఏడి శివకుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఎం కిసాన్ మూడవ విడత నిధులు పొందాలంటే ఈకేవైసీ చేసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలో 16,902 మంది రైతులు తక్షణమే ఈకేవైసీ చేసుకుని, ప్రభుత్వ సహాయాన్ని పొందాలని సూచించారు. ఈకేవైసీ చేసుకునేందుకు రైతులు తమ వలంటీర్లు, ఆర్‌బీకేలు, మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్‌లో తక్షణమే ఈకేవైసీ చేసుకోవాలని కోరారు.

9న జాతీయ స్మారక పురస్కారాల ప్రదానం

పలమనేరు: పట్టణ సమీపంలోని కళామందిరంలో ఈ నెల 9న జాతీయ స్మారక పురస్కారాల ప్రధాన కార్యక్రమం ఉంటుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగుభాష, సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అందులో కోరారు.

సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



పలమనేరు: పట్టణ సమీపంలోని రొంటకుంట్ల వద్ద వెలసిన రమాదేవి సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్రతం చేయడంతో కలిగే మేలును అర్చకులు వెంకటేశ్ అయ్యంగార్ వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

విరూపాక్షి మారెమ్మకు రాహుకాల పూజలు



పుంగనూరు: పట్టణంలోని బస్టాండులో వెలసిన శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం మధ్యాహ్నం రాహుకాల పూజలు నిర్వహించారు.
అమ్మవారిని నవధాన్యాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై చలిపిండి దీపాలు వెలిగించి, చల్లముద్ద పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రెచ్చగొట్టేందుకే చంద్రబాబు షోలు



ఎంపీపీ రెడ్డెప్ప

పలమనేరు: తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టేందుకే చంద్రబాబు కుప్పంలో షోలు నిర్వహిస్తున్నారని, వైఎస్సార్‌సీపీ కుప్పం పరిశీలకులు, బైరెడ్డిపల్లె ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే కుప్పం ఎత్తిపోయిందని చంద్రబాబుకు బాగా అర్థమైందన్నారు. ఎలాగైనా కుప్పం ప్రజలను ఏమార్చేందుకు రావడం మంత్రి పెద్దిరెడ్డిని, పోలీసులను విమర్శించడం పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రెండ్రోజులు కుప్పానికి వచ్చిన పాపానికి ఆ పార్టీ కార్యకర్తలు కేసులతో పడుతున్న కష్టాలు చంద్రబాబుకు పట్టవన్నారు. తన రాజకీయ స్వార్థం కోసం అమాయకుల ప్రాణాలు పోయినా తన నైజాన్ని మార్చుకోవడం లేదన్నారు.

ప్రభుత్వ పెన్షనర్లకు సకాలంలో పించన్ ఇవ్వాలి



పలమనేరు: పింఛనుదారులకు సకాలంలో పెన్షన్లు ఇవ్వాలని స్థానిక ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘం ఏపీఎన్‌జీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపింది. ఆ సంఘం రాష్ట్ర నాయకులు గురురాజారావు మాట్లాడుతూ పింఛనునే నమ్ముకున్న తమ కుటుంబాలకు ఆదే ఆధారం కాబట్టి ప్రతి నెలా సకాలంలో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటున్నా..

- సీఎం చొరవతోనే నియోజకవర్గ అభివృద్ధి
- ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా జనం జగన్ వైపే..
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి





ప్రజల సమస్యలు ఆలకిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇరికిపెంటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సోమల: తనకు ఎల్లవేళలా అండగా నిలుస్తున్న పుంగనూరు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటున్నామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని 37 గ్రామాల్లో శుక్రవారం ఆయన పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, విమర్శలు చేసినా ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతు పలుకుతున్నారని తెలిపారు. పేదరికాన్ని రూపుమాపడానికే నిస్వార్థ ఆలోచనతో సీఎం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తనకు ఎంతో సంతృప్తిని కలిగిస్తున్నాయన్నారు. తాను అడిగిన ప్రతి అభివృద్ధి పనికి, ప్రాజెక్టులకూ ఆమోదం తెలుపుతున్న సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. దశాబ్దాలపాటు రాజకీయాల్లో ఉన్నామని, పాఠశాలలపై ఇంత శ్రద్ధ చూపుతున్న సీఎంను తానెప్పుడూ చూడలేదని కొనియాడారు. నియోజకవర్గంలో 90 శాతం రోడ్లను పూర్తి చేశామని, ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా తాగునీరు, సంక్షేమ పథకాలు అందిస్తామని తెలియజేశారు. సమస్యలను నేరుగా తన దృష్టికే తీసుకురావచ్చని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికే పల్లెబాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఇరికిపెంటలో పతాకావిష్కరణ

మండలంలోని ఇరికిపెంట గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను మంత్రి ఆవిష్కరించారు. గ్రామ గ్రామాన వైఎస్సార్‌సీపీకి ప్రజలు అండగా నిలవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు ఎంపీపీ ఈశ్వరయ్య, సంయుక్త కార్యదర్శులు రవీంద్రరెడ్డి, ఆకుల గజేంద్ర, ఎంపీపీ ఈశ్వరయ్య, అమాస మోహన్, నాగేశ్వరరావు, గంగాధర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఆహ్వానం

పలమనేరు: వేమన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని యోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు వేమన విగ్రహావిష్కరణకు ఆహ్వానించారు. మంత్రి పెద్దిరెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. పట్టణంలో ఈనెల 19న నిర్వహించే వేమన విగ్రహ ఆవిష్కరణకు విచ్చేయాలని మంత్రిని ఆహ్వానించారు. మంత్రిని కలిసిన వారిలో ట్రస్టు అధ్యక్షులు చెంగారెడ్డి, ఉపాధ్యక్షులు బాలాజీరెడ్డి, సభ్యులు అమరనాథరెడ్డి, జైప్రకాష్‌రెడ్డి, బాబురెడ్డి, రెడ్డెప్పరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోవిందురెడ్డి, యూత్ ప్రెసిడెంట్ ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

ఇంటర్వ్యూలకు 55 మంది హాజరు



అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

పలమనేరు: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 25 అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టులకు శుక్రవారం జరిగిన ఇంటర్వ్యూలకు 55 మంది హాజరయ్యారు. వీరిని ఆర్డీఓ శివయ్య, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ హరినాథరెడ్డి, సీడీపీఓలు మాధవీలత, రాజేశ్వరి, వాణిశ్రీదేవి, సుజాతలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలు త్వరలోనే తెలియజేస్తామన్నారు

ప్రతిభ ఉంటే ఉద్యోగ సాధన సులభతరం



ఉద్యోగాలకు ఎంపికైన వారితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: మనలో సామర్థ్యం, ప్రతిభ ఉంటే చాలు తప్పకుండా ఉద్యోగాలు సాధించవచ్చని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడతో కలసి ఆయన పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డీఆర్‌డీఏ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం జాబ్‌మేళాను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ మేళాలో 14 బహుళజాతి కంపెనీలు పాల్గొని, ఇక్కడి యువతకు ఉద్యోగాలనిస్తున్నాయంటే ఇది నిజంగా ఈ ప్రాంత వాసులకు వరం అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఉద్యోగాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. జేడీఎం సరితారెడ్డి మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు 304 మంది హాజరుకాగా వీరిలో పలు కంపెనీల్లో ఉద్యోగాలకు 119 మంది ఎంపికైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, ఏపీఎం రమణ, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు బాలాజీ నాయుడు, జాఫర్, ఎంపీడీఓ విద్యాసాగర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం, ఏపీఎం మొగిలీశ్వర్ పాల్గొన్నారు.

గడప గడపలోనూ విశేష ఆదరణ



గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ, ప్రతి గడపలోనూ ప్రభుత్వ పథకాల కాంతులు వెదజల్లుతున్నాయని, అందుకే విశేష ఆదరణ లభిస్తోందని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ, ప్రజలతో మమేకమయ్యారు. మండలంలోని 89 పెద్దూరు గ్రామంలో ఆయనకు మహిళలు మంగళహారతులిస్తూ స్వాగతం పలికారు. గ్రామాల్లో ప్రజాసమస్యలను తెలుసుకుని భరత్ అక్కడికక్కడే పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పల్లెటూర్లలో మౌళిక సదుపాయాలను కల్పించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించినట్లు తెలిపారు. మండలంలోని కెంచనబళ్ల పంచాయతీ వీరనాగపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చౌడేశ్వరమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ భరత్ రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ నితిన్ రెడ్డి, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్‌లు మల్లిక, సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యులు వెంకటరమణ, వెంకట్రామే గౌడు, చలపతి, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు వెంకటేశు, గోవిందప్ప, బద్యానాయక్, జయరాం, మునెమ్మ, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ పాల్గొన్నారు.

నేడు శాంతిపురంలో...

శాంతిపురం: మండలంలోని తుమ్మిశి పంచాయతీలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ వసుంధర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అందుతున్న పథకాలను ఆరా తీయనున్నట్లు చెప్పారు.

అంతర జిల్లా క్రీడా పోటీలు ప్రారంభం

- పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పోటీలు
- పోటీలకు హాజరైన పది కళాశాలల క్రీడాకారులు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: ఇంటర్ డిస్ట్రిక్ (అంతరజిల్లా) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలు పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, అసిస్టెంట్ కలెక్టర్ స్వరూప్ ఈ పోటీలను ప్రారంభించారు. తొలుత జెండా ఆవిష్కరణ, క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్, క్రీడాకారుల పరిచయ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. ఆటలతో శారీరక దృఢత్వం పెరుగుతుందని, పోటీతత్వం అలవడుతుందని చెప్పారు. గెలుపోటములతో సంబంధం లేకుండా కేవలం క్రీడాస్ఫూర్తితోనే మెలగాలని క్రీడాకారులకు సూచించారు. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని స్థానిక కళాశాలతో పాటు చంద్రగిరి, పద్మావతి, శ్రీవేంకటేశ్వర, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల, ఎస్వీసెట్ చిత్తూరు, వేము పాలిటెక్నిక్, కలికిరి, మదనపల్లె, కుప్పం కళాశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఇక్కడ ఖోఖో, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, చెస్, బాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ మహమూద్ తెలిపారు. తొలుత వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి, కాసేపు ఆటలో పాల్గొన్నారు. ఇలా ఉండగా శనివారం అథ్లెటిక్ విభాగంలో 100, 200, 400, 800 పరుగు పందెం, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, హైజంప్, లాంగ్‌జంప్‌తో పాటు అథ్లెటిక్స్ నిర్వహించన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీ సుధ, రాష్ట్ర కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు, న్యాయమూర్తులు కార్తీక్, సింధు

పుంగనూరు: రాష్ట్ర లీగల్ సర్వీసస్ అథారిటీ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 11న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవారావు తెలిపారు. శుక్రవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్, అదనపు జూనియర్ సివిల్‌జడ్జి సింధుతో కలసి ఆయన న్యాయవాదులతో, అధికారులతో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి వాసుదేవరావు మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీకి అనువైన కేసులను పరిష్కరిస్తామన్నారు. న్యాయవాదులు, కక్షిదారులు, అధికారులు సమన్వయంతో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులపై అప్పీల్ ఉండదని తెలిపారు. దీంతోపాటు కేసులకు కోర్టు ఫీజులు వాపసు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శరవణకు డాక్టరేట్



శరవణ

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరుకు చెందిన శరవణకు ద్రావిడ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. పుంగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఆయన ద్రవిడ వర్సిటీలో ఆచార్య అనురాధ పర్యవేక్షణలో 'ట్రాన్స్‌మిషన్ ఆఫ్ ఫోరెన్సిక్ డిజిటల్ ఎవిడెన్సిస్ బై యూజింగ్ క్రిప్టోగ్రఫీ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఇందుకుగాను ఆ యూనివర్సిటీ పరీక్షల విభాగం నియంత్రణ అధికారి నాగేశ్వరరావు డాక్టరేట్‌ను ప్రకటించారు.

80 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

రొంపిచెర్ల: తుపాను బాధిత రైతులకు 80 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలను అందిస్తున్నట్లు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం గానుగచింత, మోటుమల్లెలలోని ఆర్బీకేల్లో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో 278 మంది రైతులకు చెందిన వేరుశనగ పంట దెబ్బ తిన్నట్లు తెలిపారు. వారికి 80 శాతం సబ్సిడీతో 132 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఒక బస్తా రూ.515 చొప్పున ఒక రైతుకు 2 బస్తాలు ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, ఏవో సుధారాణి, ఏఈవో ఖాదర్‌వలీ, సర్పంచ్ హేమలత, ఎంపీటీసీ రమణయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు వంద శాతం ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్

పెద్దపంజాణి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు వందశాతం ఉండే విధంగా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం విద్యాశాఖపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు అందరూ పాఠశాలకు హాజరై మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాడు–నేడు పనులలో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఏఈ దేవేంద్రకు సూచించారు. వైద్య సిబ్బంది పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల అనారోగ్య సమస్యలను గుర్తించి తగిన విధంగా వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ హేమలత, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

శాంతిపురం: మండల కేంద్రంలోని 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, ఎండీ సుబ్రమణ్యం, ఏడీఈ సాగర్ తెలిపారు. 15 సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.
మండలంలోని కనుమలదొడ్డి, అనికెర, గుండిశెట్టిపల్లి, రెడ్లపల్లి, రామకుప్పం మండలం చెల్దిగానిపల్లి, రామకుప్పం, చిన్నబల్దారు, వి.కోట మండలం పడిగలకుప్పం, పాముగానిపల్లి, వి.కోటటౌన్, పాపేపల్లిమిట్ట, కస్తూరి నగరం, యాలకల్లు, సుద్దలకుప్పం, దొమ్మరమిట్టలోని 33/11కెవి సబ్ స్టేషన్ల పరిధిలో కోత అమలులో ఉంటుందన్నారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం అనుబంధంలోని శ్రీవరదరాజులస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శ్రీసత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత మూల స్థానంలో వెలసిన శ్రీశ్రీదేవి, పెరుందేవి సమేత వరదరా జులస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తిని సత్యనారాయణస్వామిగా అలంకరించి ఆలయ ఆవరణలోని వేదికపై కొలువుదీర్చారు. పండితులు శాస్త్రోక్తంగా వ్రతం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు డ్రామాలు ఇక సాగవు

- ఇచ్చిన మాటను నిలుపుకున్న ప్రభుత్వమిది
- పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ



పలమనేరులో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: చంద్రబాబు మాయమాటలు, డ్రామాలు ఇక సాగవని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఎద్దేవా చేశారు. పలమనేరు మున్సిపాలిటీ, మండలంలో శుక్రవారం నిర్వహించిన కొత్తపింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీకి ఆదరణ ఉందని జనాన్ని నమ్మించేందుకు అమాయకుల ప్రాణాలను బలితీసుకుంటున్నారని చెప్పారు. ఎక్కడ మీటింగ్‌పెట్టినా టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టడం, పోలీసులను బెదిరించడం లాంటివి ఆయన రాజకీయ ట్రిక్కులుగా మార్చుకున్నారన్నారు. కుప్పంలో టీడీపీ ఇప్పటికే ఖాళీ అయిందనే భయంతోనే మూడు నెలలకోసారి షో చేస్తున్నారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో కనీసం కుప్పంలో కూడా గెలవలేనేమోనన్న ఆందోళనతో చంద్రబాబు రగిలిపోతున్నారని విమర్శించారు. గతంలో ఆయన అధికారంలో ఉన్నప్పుడు లేదా ఇతర పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు సొంత జిల్లా అయిన చిత్తూరులో ఆయన మెజారిటీ ఎమ్మెల్యేలను ఎందుకు గెలిపించుకోలేకపోయారని ప్రశ్నించారు. కుప్పానికి వచ్చిన ప్రతిసారీ మంత్రి పెద్దిరెడ్డి ప్రస్తావన లేకుంటే ఆయనకు నిద్ర పట్టదన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్నింటినీ అమలు చేస్తోందని చెప్పారు. ఇక ప్రభుత్వంపై ఎలాగూ వ్యతిరేకంగా మాట్లాడలేక పోలీసులు, నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు.

పింఛన్లపై తప్పుడు ప్రచారం తగునా?

ఉన్న పింఛన్లను తొలగించేస్తున్నారని టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. మున్సిపాలిటీలో ఇప్పటికే పాత పింఛన్లు 5,016 ఉండగా ప్రస్తుతం కొత్త పింఛన్లు 162 మంజూరైనట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ పేర్కొన్నారు. ఇదేంఖర్మ అంటూ ఇళ్లవద్దకొచ్చే టీడీపీ నాయకులు మిస్డ్‌కాల్ ఇవ్వాలంటూ లబ్ధిదారుల డేటాను తీసి వారికి పింఛన్లు రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. అందుకే టీడీపీ నాయకులు వస్తే స్పందించద్దని సూచించారు. గత ప్రభుత్వంలో పేరుకుపోయిన రూ.9.33 కోట్ల విద్యుత్ బకాయిలను చెల్లించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మున్సిపాలిటీలో అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతూ, అభివృద్ధి పథంలో సాగుతుంటే చంద్రబాబు నచ్చడం లేదని విమర్శించారు. అందుకే వారి తప్పుడు ప్రచారాలను అవ్వాతాతలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, ఎంపీపీ రోజా, వైస్ చైర్మన్లు చాన్మాక మాల్, కిరణ్, వైస్ ఎంపీపీలు జయశ్రీ, గజేంద్ర, పట్టణ, మండల కన్వీనర్లు జాఫర్, బాలాజీ నాయుడు, రాష్ట్ర కార్యదర్శులు మురళీకృష్ణ, రంగన్న, విశ్వనాథరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మృత్యుంజయస్వామి ఆలయానికి భూమిపూజ

మున్సిపాలిటీ పరిధిలోని బోడిరెడ్డిపల్లి, గద్దూరు గ్రామాల వద్ద నూతనంగా నిర్మించనున్న మృత్యుంజయస్వామి ఆలయానికి నిర్వాహకులు శుక్రవారం భూమిపూజ చేశారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై అక్కడ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఆలయాల నిర్మాణాలు చేపట్టడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మాజీ కన్వీనర్ మండీసుధా, కౌన్సిలర్ చాముండేశ్వరి, నాగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

రామకుప్పం: మండలంలోని పంద్యాలమడుగు సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను శుక్రవారం వైఎస్సార్ సీపీ నేతలు పింఛనుదారులకు అందజేశారు. సచివాలయ పరిధిలో 18 నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ శ్వేత, పార్టీ కో–కన్వీనర్లు చంద్రారెడ్డి, బాబురెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జయమ్మ, నేతలు రాంబాబు, నాగభూషణ నాయక్ పాల్గొన్నారు.